ఇప్పటికి మాత్రం . కోపం తగ్గించు సుశీలా నా జీవన ప్రేమ లీలా "

సుశీల నవ్వేసింది. 'అలారండి దారికి-హన్నా అబద్ధాలా! ఇక ఆ విషయం గుర్తు చేసుకోవడం నాకూ ఇష్టం లేదు ఎందుకంటే '

'ఎందుకంటే '

సుశీల మాట్లాడలేదు. తన తలలోవే మల్లెపూలు వాసన చూడసాగింది

* * *

దబదబ తలుపు శబ్దానికి మెలకువ వచ్చింది సుశీలకు. బద్ధకంగా ఆవులించి టైంచూస్తే ఆరు దాటుతోంది. కళ్ళు నులుముకొంటూ తలుపు తీసింది. ఎదురుగా ఖంగారుగా నిలబడ్డ పరమేశాన్ని చూసి ఖంగారుపడింది.

'ఏడీవీడూ నిద్రలేవలా లేపమ్మా కొంచెం అర్జంటూ' అంటూనే వచ్చి కుర్చీలో కూలబడ్డాడు పరమేశం. సుశీల వెళ్ళి రాంబాబును లేపింది

"ప్రొద్దున్నే కొంపలు మునిగి పోతున్నట్లు నిద్రలేపమని ఎవడు చెప్పాడ్రా నీకూ సుశీలాకాఫీ ఇవ్వవూ "అంటూ వస్తున్నాడు రాంబాబు హాలులోకి.

'కాఫీకాదు వెళ్ళాలి. ఏరా నిన్న మధ్యాహ్నమనగా ఆ సుబ్బిగాడికి ఆక్సిడెంటయి హాస్పిటల్‌లో వుంటే నువ్వటు చూడకపోయావు. నేను ఇప్పటివరకూ అక్కడే వుండి వస్తున్నా. ఫర్వాలేదులే. మరీ ప్రమాదం లేదు,చెడ్డలో మంచంటారు చూడు. ఎత్తుపళ్లూ రెండూ రాలిపోయాయి మూతి ఆంజనేయుడి మూతిలావున్నా..."

పరమేశం మాటలు వినడం మానేసిన రాంబాబు భార్య వంక గుర్రుగా చూడ సాగాడు.

—నేమాని సత్యనారాయణ

మరీ మినీ కథ

# శ్రీరంగనీతులు

"ఇవ్వాళ మన గాంధీతాత పుట్టినరోజు. ఈయన మనకు దర్శన మిచ్చిన దేవుడు. అహింసయే ఈయన వేదము. ఈయన అడుగు జాడల్లో నడవడం మన కర్తవ్యం. కావున మీరు ఇవ్వాళ మేకల్ని కోసి మాంసం అమ్మవద్దు" అని గ్రామ పెద్ద జగన్నాథంగారు బోధిస్తున్నారు

అందరూ ఒప్పుకొంటూ ఎవరి దారిన వారు వెళ్లారు. నరసింహం ఒక్కడు మిగిలి పోయాడు. నేడు గడపడం ఎలా? ఇదే ఆయన ప్రశ్న.

రోజూ నరసింహం మేకల చర్మాలు ఇక్కడినుంచి పట్నానికి తీసికెళ్ళి అమ్ముతాడు. అందులో రోజూ మూడు ఒక్కోనాడు నాలుగురూపాయలు సంపాయిస్తాడు. మరి ఇవ్వాళ?

పస్తులు తప్పవనుకొంటూ గొణుక్కొంటూ ఇంటిదారి పట్టాడు.

"గాంధీతాత పుట్టిన్నాడు పస్తులుంటె పుణ్యమైనా లభిస్తది. అతనిలో చోటుచేసుకొందీ వాక్యం.

ఇంట్లోకి అడుగుపెట్టాడు.

"ఎమామె' ఇయ్యాల్ల బేగే ఇంటికొస్తివి. బ్యారం లేదా?" అందుకొంది భార్య సీతాలు.

సీతాలు జగన్నాథం గారింట పని మనిషి.

"మీ అయ్యగారొచ్చి ఇయ్యాల మేకలు కొయ్యెద్దు. గాంధీతాత పుట్టిన రోజు అని ఇంకేమో చెప్పాడే."

"అయ్యో! నేను ఇప్పుడే ఆల్లింట్ల కోడ్ని కోసి వస్తున్నగద. అయ్యగారే కొయ్యమంద్రు" అంది అర్థంకాని సీతాలు.

—శశి